సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 6 । నవంబర్ । 2023



సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజా సమస్యలపరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అరకు ఎంపీ మాధవి పేర్కొన్నారు. 8లో



150 మందికి వైద్యసేవలు

రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో 150 మందికి వైద్యసేవలు అందించారు. రోగులకు భోజనం ఏర్పాటు చేశారు. 8లో



గోపూజలు పునః ప్రారంభం

సింహాచలం: సింహగిరిపై శ్రీగోకులంలో గోపూజలను పునరుద్ధరించారు. అక్కడే టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశారు. 8లో

న్యూస్‌రీల్

ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పాడేరులో నేడు పలు కార్యక్రమాలు

పాడేరు రూరల్ : వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభించి నేటికి ఆరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో సోమవారం పాడేరు నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి క్యాంప్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపాయి.. కేక్‌కు కట్ చేయడం, సంక్షేమం, అభివృద్ధితో పాటు సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించిన అంశాలపై మీడియా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నాయి. ఈ కార్యక్రమాల్లో ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు, పార్టీ మండల అధ్యక్షులు, పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరాయి.

చింతపల్లి ఆస్పత్రిలో జనరల్ సర్జన్ నియామకం



అజయ్‌బాబు

చింతపల్లి రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా డాక్టర్ డి.అజయ్‌బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు చత్తీస్‌గఢ్ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసిన ఆయనను ప్రభుత్వం ఇక్కడ నియమించింది.

108లో ప్రసవం



శిశువుతో 108 సిబ్బంది

ఎటపాక: నిండు గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రసవించింది. మండలంలోని కుసుమనపల్లి గ్రామానికి చెందిన హారిక శనివారం రాత్రి పురిటి నొప్పులతో బాధపడుతోంది. ఆమెను 108 వాహనంలో రాత్రి పది గంటల సమయంలో గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రసవించి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను పీహెచ్‌సీకి తరలించినట్టు ఈఎంటీ జింకా రాము, పైలెట్ అనిల్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



భాగ్యవతి (ఫైల్)

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కింజేరు గ్రామానికి చెందిన విద్యార్థిని కిల్లో భాగ్యవతి(15) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈమె పాడేరు కేజీబీవీ పాఠశాలలో టెన్త్ చదువుతోంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు పాఠశాల యాజమాన్యం వైద్యం చేయించలేదని తల్లిదండ్రులు డాలిమ్మ, రాజు ఆరోపించారు. ఈనెల రెండున తమ కుమార్తెకు ఆరోగ్యం బాగులేదని సమాచారం ఇవ్వడంతో వెంటనే తమ కుమార్తెను అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లి చేర్పించామని వివరించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు తెలిపారు. విద్యార్థిని మృతికి సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన సన్యాసిరావు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ నూకరాయితోట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బి.సింగవరానికి చెందిన గెమ్మెలి సన్యాసిరావుకు తీవ్ర గాయాలయ్యాయి.ద్విచక్ర వాహనంపై కుసుకూరు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతనిని వెంటనే 108లో రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ లోకేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫుల్ జోష్

భారీగా పర్యాటకుల రాకతో మన్యం పులకించిపోయింది. వీకెండ్ కావడంతో సందర్శనీయ ప్రాంతాలు కిటకిటలాడాయి. మేఘాల కొండ, బొర్రా గుహలు, గిరిజన మ్యూజియం, చాపరాయి, కొత్తపల్లి జలపాతాల వద్ద సందడి నెలకొంది.



జెండాకొండపై మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



వంజంగి హిల్స్ వద్ద పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

సాక్షి, పాడేరు: జిల్లాలోగల ప్రముఖ పర్యాటక కేంద్రాలన్నీ ఆదివారం కళకళలాడాయి. పాడేరు మండలంలోని వంజంగి కొండ వద్ద ఉదయం నుంచి పర్యాటకులు సందడి చేశారు. ఆకాశాన్ని తాకుతున్న మేఘాలను, మంచు అందాలను తిలకించారు.

చెరువులవేనంలో..

చింతపల్లి రూరల్: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన చెరువులవేనంలో పర్యాటకుల సందడి నెలకొంది. వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకించారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం పర్యాటకుల రాకతో కళకళలాడింది. కుటుంబ సమేతంగా తరలివచ్చి జలపాతంలో స్నానాలుచేస్తూ సందడి చేశారు.

హుకుంపేట: జెండాకొండకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలు, సూర్యోదయం వేళ ప్రకృతి రమణీయతను తిలకించి మధురానుభూతి పొందారు. థింసా రాళ్లు, తేనెపట్టు అందాలను తిలకించారు.

మురిసిన చాపరాయి

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం పర్యాటకుల రాకతో మురిసిపోయింది. జలపాతంలో రోజంతా స్నానాలు చేస్తూ సందడి చేశారు. వలిసె, పొద్దుతిరుగుడు తోటల్లో ఫొటోలు తీసుకుని సందడి చేశారు.

బొర్రా గుహలకు రూ.2.46 లక్షల ఆదాయం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు ఆదివారం రద్దీగా కనిపించాయి. బొర్రాగుహలను 2,972 మంది సందర్శించగా రూ.2.46 లక్షల ఆదాయం వచ్చినట్టు బొర్రా మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.తాటిగుడ, కాఫీ ప్లాంటేషన్, కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు కళకళలాడాయి.



తాటిగుడ వ్యూపాయింట్‌కు తరలివచ్చిన సందర్శకులు



చెరువులవేనంలో వ్యూపాయింట్ వద్ద సందడి



మేఘాల కొండపై కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు



పొద్దు తిరుగుడు తోటల్లో పర్యాటకులు

కొత్త అందాల లోకం..

మన్యానికి వచ్చే పర్యాటకుల్లో జోష్ నింపేలా వసతులు అందుబాటులోకి తెచ్చేందుకు పర్యాటకశాఖతో అటవీశాఖ పోటీ పడుతోంది. మరపురాని అనుభూతి పొందేలా.. ప్రకృతి ఒడిలో కొత్త అందాలను పరిచయం చేసేలా ఏర్పాట్లు చేస్తోంది. కొద్దిరోజుల్లోనే ఇవి పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి.

- చిలకలగెడ్డ చెక్‌పోస్టు పార్కు వద్ద పూర్తిస్థాయిలో సౌకర్యాలు
- అరకులో అందుబాటులోకి రానున్న ఎకో క్యాంప్ సూట్లు
- అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకం అభివృద్ధికి చర్యలు



చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ వద్ద అటవీశాఖ ఏర్పాటు చేసిన ఎకో టూరిజం పార్కు

అనంతగిరి: సెలవు వచ్చిందంటే చాలు పర్యాటకులు మన్యంలో వాలిపోతుంటారు. ఆహ్లాదకర వాతావరణంలో తనివితీరా ఎంజాయ్ చేస్తుంటారు. వీరికి మరింత అనుభూతి మిగిల్చేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా ఖాళీస్థలాలను సందర్శనీయ ప్రాంతాలుగా తీర్చిదిద్దుతూ ఆదాయ మార్గాలను పెంచుకుంటోంది. మన్యానికి ముఖద్వారమైన అనంతగిరి మండలంలోని చిలకలగెడ్డ చెక్‌పోస్టును ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఇప్పటికే పార్కుగా అభివృద్ధి చేసింది. దీంతోపాటు అరకులోయలో అటవీశాఖ అతిథి గృహం ప్రదేశంలో పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ద పర్యాటకులు బస చేసేలా అభివృద్ధి చేసింది. పాడేరు డీఎఫ్‌వో వినోదకుమార్ చొరవ, సిబ్బంది సహకారంతో పార్కులు ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటున్నాయి. పర్యాటకులకు మూడు రోజుల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి.

చిలకలగెడ్డ చెక్‌పోస్టు వద్ద..

అరకు–విశాఖ ప్రధాన ఆనుకుని ఉన్న చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ వద్ద ఖాళీ ప్రదేశాన్ని ఎకో పార్కుగా అభివృద్ధి చేసి ఉచిత ప్రవేశం కల్పించింది. పరిసర ప్రాంతీయులు సెలవు రోజుల్లో ఇక్కడికి తరలివస్తున్నారు. ఇక్కడ పర్యాటకులకు అనువుగా రచ్చబండలు, పాత్‌వే, కాఫీ హౌస్, స్నాక్స్ అందుబాటులోకి తెచ్చేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. సమీపంలోని కొండపైకి ట్రెక్కింగ్‌కు వెళ్లేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తోంది.

అరకులో..

అరకు–చొంపి రోడ్డును ఆనుకుని ఉన్న అటవీశాఖ గెస్ట్‌హౌస్ ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఆధునిక హంగులతో పర్యాటకులు రుచులకు అనుగుణంగా ఇప్పటికే పార్కును స్థానిక వనరులతో తీర్చిదిద్దారు.

- చిల్డ్రన్‌పార్కు, నర్సరీ, ఎకో క్యాంపు షూట్స్, పర్యాటకులు రాత్రి బసచేసేలా టెంట్లు, వాకింగ్ ట్రాక్స్, ఎకో కార్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చారు. అలంకరణ పూలమొక్కలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్యాంప్ షూట్‌కు అద్దె రోజుకు రూ.3వేలు, క్యాంపెయినింగ్ టెంట్‌కు సంబంధించి ఒక్కొక్కరికి రూ.600 చొప్పున అద్దె నిర్ణయించినట్టు అటవీశాఖ అధికారవర్గాలు తెలిపాయి.

మమేకమయ్యేలా..

ఎకో ఫ్రెండ్లీ కార్యక్రమంలో పర్యాటకులతో అటవీశాఖ సిబ్బంది మమేకమయ్యేలా కార్యాచరణ రూపొందించారు. అడవుల సంరక్షణపై అవగాహన కల్పించడమే కాకుండా పర్యాటకులు మైమరచిపోయేలా అనుభూతి పొందేలా అటవీశాఖ కృషి చేస్తోంది.

మధుర జ్ఞాపకంగా మిగిలేలా..

అరకు, అనంతగిరి పార్కులను సందర్శించే పర్యాటకులకు మరపురాని అనుభూతి పొందేలా తీర్చిదిద్దుతున్నాం. ఇందుకు అవసరమైన సహకారం అటవీశాఖ ఉన్నతాధికారులు అందిస్తున్నారు. పర్యాటకులకు మధురానుభూతి మిగిల్చడం, అటవీ సంరక్షణ లక్ష్యంగా చర్యలు చేపట్టాం.

– శ్రీనివాసరావు, ఫారెస్ట్ రేంజర్, అరకు

కొద్దిరోజుల్లో అందుబాటులోకి..

అడవుల సంరక్షణ బాధ్యత మనందరిపై ఉంది. దీనిలో భాగంగానే ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులక అవగాహన కల్పిస్తాం. మన్యంలో మరో కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసేలా పార్కులను తీర్చిదిద్దుతున్నాం. వీటిని మరో మూడు రోజుల్లో అందుబాటులోకి తెస్తాం.

– వినోద్‌కుమార్, డీఎఫ్‌వో, పాడేరు



అరకులోయ గెస్ట్‌హౌస్ వద్ద ఎకో క్యాంపు సూట్



చిల్డ్రన్ ప్లే గ్రౌండ్



పర్యాటకులకు ఆహ్లాదం పంచేలా ఏర్పాట్లు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల, మర్రివాడ, రాజేంద్రపాలెం, డౌనూరులో పోలింగ్ కేంద్రాలను ఆదివారం జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ సందర్శించారు. ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. బీఎల్‌వోల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం స్పెషల్ డ్రైవ్ పారదర్శకంగా జరగాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు.



వివరాలు తెలుసుకుంటున్న జేసీ శివశ్రీనివాస్

కూనవరం: మండలంలోని కూనవరం, ఈఆర్‌పురం, చింతూరు మండలాల్లో పోలింగ్ కేంద్రాలను ఆదివారం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటివద్ద సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు. కూనవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు, టేకులబోరు ఎంపీపీఎస్ పాఠశాలలో ఒకటి, వీఆర్‌పురం మండలం జీడిగుప్పలో రెండు, చింతూరు మండలం ఎర్రంపేట కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియకు స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్లు కె. అనసూయ, శ్రీధర్, డీటీ హరికిరణ్ మౌళి, బీఎల్‌వోలు పిట్టల వెంకన్న, అశోక్, ఉమావతి పాల్గొన్నారు.



కూనవరం హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన పీవో కావూరి చైతన్య

విరబూసిన సుమ సోయగం





అరకు ప్రాంతంలోని పంచాయతీ రణజిల్లెడ జలపాతానికి అతి సమీపంలో రైతు గరువుల్లో వేసిన వలిసె, పొద్దుతిరుగుడు తోటలు కనువిందు చేస్తున్నాయి. ఈప్రాంతానికి వచ్చిన పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. విరబూసిన ఈ తోటల్లో ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.

– అరకులోయ రూరల్

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- నవంబర్ 19వ తేదీన విశాఖపట్నంలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.rakrhieducation.com)ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత : ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం:

అవగాహన సదస్సు తేదీ: నవంబర్ 19, 2023(ఆదివారం)

వేదిక: డా. బి.ఆర్.అంబేద్కర్ భవన్, రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా, రామా టాకీస్ దగ్గర, శ్రీనగర్, విశాఖపట్నం.

సమయం: ఉదయం 09.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8977625795

ప్రజలకు అందుబాటులో ఉండాలి

హుకుంపేట: ఫీడర్ అంబులెన్సు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఉమ్మడి జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనువాసులు సూచించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జిల్లాలోని 42 ఫీడర్ అంబులెన్సుల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ మూడు కేసులకు సేవలందించాలని సూచించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజల వద్ద మీ ఫోన్ నంబర్లు ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక శిక్షకులు అరుణ్‌కుమార్, గజేందర్ పాల్గొన్నారు.

అథ్లెట్‌కు సత్కారం



పతకం సాధించిన సింహాచలంనాయుడుని సత్కరిస్తున్న జీఎస్‌యూ నాయకులు

పాడేరు రూరల్ : తెలంగాణలో గతనెలలో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్ జాతీయ చాంపియన్ స్పోర్ట్స్ మీట్ 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన సింహాచలం నాయుడిని ఆదివారం సత్కరించారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న అతనిని విద్యార్థి సంఘ నాయకులు, జీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బూడిదె సుమన్, ప్రధాన కార్యదర్శి బూడిదె మాధవరావు, జిల్లా సభ్యులు మణుగూరు బాబూజీ, అనిల్, మన్మథరావు శాలువా కప్పి సన్మానించారు.

గంజాయి తోటలు ధ్వంసం



గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పాడేరు రూరల్: మండలంలోని వంతాడపల్లి శివారు సప్పిపుట్టు గ్రామంలో ఆదివారం పోలీసులు గంజాయి తోటలను ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. గంజాయి సాగు చేస్తున్న సప్పిపుట్టు గ్రామానికి చెందిన మర్రి రామారావు, వంతాల బాసురావులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి సాగు, అమ్మకాలు, రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్ హెచ్చరించారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి

కొయ్యూరు: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అరకు ఎంపీ మాధవి తెలిపారు. మండలంలోని డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు బి.అప్పారావు ఆదివారం విశాఖలో ఎంపీ మాధవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపీ మాధవి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాలో తాగునీటి బోర్లు మంజూరు చేయడంతో ఎంపీ మాధవికి అప్పారావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ దేముడు, రాజేష్,నాగరాజు, నూకరాజు పాల్గొన్నారు.

150 మందికి వైద్యసేవలు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో రంపచోడవరంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆర్‌కే మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. స్వామి వేదవిద్యానంద మహారాజ్ పర్యవేక్షించారు. వైద్యులు దాసరి ఉమ మహేష్ ,తలారి వెంకట సుబ్బారావు,రాయుడు శ్రీనివాస్, ఎస్. సంపత్ కుమార్ 50 మందికి వైద్య సేవలు అందించారు. క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్ గాధిరాజు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. రోగులకు భోజన సౌకర్యం కల్పించారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలు సత్యవతికి పింఛను అందజేస్తున్న వలంటీర్ ఆనంద్‌కుమార్

రాజవొమ్మంగి: కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని చెరకుంపాలెంకు చెందిన నెల్లిపూడి సత్యవతికి ఆదివారం గ్రామ వలంటీర్ ఆనంద్‌కుమార్ అక్కడికి పింఛను అందజేశాడు. ఈ సందర్భంగా అతనిని సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు అభినందించారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్లు మంజూరు

రాజవొమ్మంగి: జిల్లాలోని రంపచోడవరం డివిజన్‌కు 6, చింతూరు డివిజన్‌కు రెండు ఫిష్ ఆంధ్రా రిటైల్ యూనిట్లు మంజూరయ్యాయని డివిజినల్ ఫిషరీస్ అధికారి సీహెచ్ రమేష్ తెలిపారు. దీనిలో భాగంగా రాజవొమ్మంగికి మంజూరైన రెండు యూనిట్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో యూనిట్ ఖరీదు రూ.లక్ష కాగా వాటాదారుడు తన వంతుగా రూ.10 వేలు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు దగ్గరలోని బ్యాంకు ద్వారా రుణం సమకూర్చుతారన్నారు.

క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- శబరిమల, పంచారామాలకు ప్యాకేజీలు
- లంబసింగి, అరకు, ధారమఠంకు బస్సులు



డాబాగార్డెన్స్: శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, విశాఖపట్నం రీజియన్ ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 5, 6, 7 రోజుల ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించింది. అయ్యప్ప స్వాముల సేవలో విశేష అనుభవం కలిగిన సుశిక్షితులైన డ్రైవర్లతో సురక్షిత ప్రయాణం అందజేస్తుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలతో పాటు నౌరంగపూర్, కోరాపుట్, జైపూర్ ప్రాంతాల నుంచి కూడా అయ్యప్ప భక్తుల కోసం అమరావతి, ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసులు నడపనుంది.

శబరిమలై ప్యాకేజీ వివరాలు

5 రోజుల యాత్ర: విజయవాడ, మేల్ మరవత్తూర్, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో శ్రీపురం , కాణిపాకం, తిరుపతి, విజయవాడ.
ప్రయాణచార్జీ (ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.6,600, అల్ట్రా డీలక్స్ రూ.6,550

6 రోజుల యాత్ర: విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో తిరుపతి, శ్రీకాళహస్తి, అన్నవరం.
ప్రయాణచార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,000, అల్ట్రా డీలక్స్ రూ.6,900

7 రోజుల యాత్ర: విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారపూడి, అన్నవరం.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,500, అల్ట్రా డీలక్స్ రూ.7,450

7 రోజుల యాత్ర: విజయవాడ, శ్రీకాళహస్తి, బెంగళూరు, మైసూరు, గురువాయూర్, ఎరుమేలి, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, ద్వారపూడి, అన్నవరం.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,500, అల్ట్రా డీలక్స్ రూ.7,450

లంబసింగి టూర్

కార్తీకమాసం పురస్కరించుకుని పిక్నిక్‌ల సందడి దృష్ట్యా ఆర్టీసీ లంబసింగికి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి(పాడేరు), కాఫీ తోటలు చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్ రూ.650

అరకు టూర్

కార్తీకమాసం పురస్కరించుకుని ప్రతీ శని, ఆదివారాల్లో ఉదయం 6 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. డముకు వ్యూ పాయింట్, గాలికొండ వ్యూ పాయింట్, చాపరాయి, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్ రూ.650

ధారమఠం

కార్తీక మాసంలో వచ్చే ప్రతీ శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి ధారమఠంకు సర్వీసులు బయలుదేరుతాయి. శివాలయం, ధారమఠం వాటర్ ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జన్నకొండ(అనకాపల్లి) చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.650, ఎక్స్‌ప్రెస్ రూ.550

రిజర్వేషన్ కోసం ముందస్తుగా https://www.apsrtconline.inలో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. లేదా ద్వారకా బస్ స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో బుకింగ్ సౌకర్యం ఉంది.
సంప్రదించాల్సిన నంబర్లు: 99592 25602, 73829 21540, 99592 25594, 91001 09731, 73829 14219, 9959 221199

పంచారామ క్షేత్ర దర్శిని

హిందూ సంప్రదాయంలో కార్తీక మాసంకు విశేష ప్రాముఖ్యం ఉంది. లయకారుడైన ఆ పరమశివుడిని కార్తీక మాసంలో, అందులో సోమవారం రోజున దర్శిస్తే సకల పాపాలు తొలగుతాయని ప్రతీతి. అందువల్ల ఈ ఏడాది కార్తీక మాసంలో ఐదు ప్రముఖ శైవక్షేత్రాలు దర్శించుకునే భక్తుల కోసం ఆర్టీసీ పంచారామ క్షేత్ర దర్శినిని ప్రవేశపెట్టింది. కార్తీకమాసంలో వచ్చే ప్రతీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. మరుసటి రోజు సోమవారం ఉదయం అమరావతి(అమరేశ్వరుడు), భీమవరం(భీమేశ్వరుడు), పాలకొల్లు(క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం(భీమలింగేశ్వరుడు), సామర్లకోట(కుమార రామలింగేశ్వరుడు) దర్శనాలుంటాయి.

ఏఏ రోజుల్లో..

ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు విశాఖ ద్వారకా బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి.
ప్రయాణచార్జీ(ఒక్కరికి): సూపర్‌లగ్జరీ రూ.2,100, అల్ట్రాడీలక్స్ రూ.2050

గోపూజలు పునఃప్రారంభం

- శ్రీగోకులం వద్ద టికెట్ల విక్రయాలు
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : సింహగిరిపై శ్రీగోకులంలో ఆదివారం నుంచి గోపూజలను పునరుద్ధరించారు. శ్రీగోకులంలో గతంలో గోపూజలు నిర్వహించేవారు. కొన్ని కారణాల వల్ల వాటిని నిలిపివేశారు. ఇటీవల దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీనివాసమూర్తి భక్తుల సౌకర్యార్థం గోపూజలను పునరుద్ధరించారు. శ్రీగోకులంలో ఎనిమిది మేలు జాతి కపిల గోవులను ఉంచారు. అలాగే శ్రీగోకులం వద్దే టికెట్టు కౌంటరును కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. భక్తులు రూ.50 టికెట్టు తీసుకుని గోపూజ నిర్వహించుకోవచ్చని ఈవో తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ తొలి టికెట్లు తీసుకోగా..వారిపేరిట అర్చకులు గోపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో భ్రమరాంబ, అన్నదానం విభాగం ఏఈవో నరసింగరావు, ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈ హరి, అధికారులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు...

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన గోవులకు దానా నిమిత్తం ఒక రోజుకు ఒక గోవుకు రూ.200 భక్తులు చెల్లించవచ్చని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో సుమారు 250 గోవులను పోషిస్తున్నట్టు చెప్పారు. ముఖ్యంగా గోవులకు అరటిపండ్లు, కొబ్బరిముక్కలు, ప్రసాదం, బియ్యం , అన్నం పెట్టకూడదని భక్తులకు తెలిపారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. అలాగే సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న తర్వాత భక్తులు వెంటనే కొండదిగువ శ్రీకృష్ణాపురంలోని గోశాల, వేంకటేశ్వరస్వామి ఆలయం, వరహా పుష్కరిణి, భైరవస్వామి ఆలయం, మాధవదార లను సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే స్వామివారి ఆలయంలో ప్రతీ స్వాతి నక్షత్రం రోజు జరిగే నృసింహ హోమం టికెట్లు ఇకపై ఆన్‌లైన్‌లో కూడా తీసుకునే వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 12న స్వాతినక్షత్రానికి సంబంధించి ఆన్‌లైన్‌లో టికెట్లు అందిస్తామన్నారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం : విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

సోమవారం నుంచి 12వ తేదీ వరకు గుంటూరు-రాయగడ (17243)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 13వ తేదీ వరకు రాయగడ-గుంటూరు (17244)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 12వ తేదీ వరకు మచిలీపట్నం-విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్,13వ తేదీ తేదీ వరకు విశాఖ-మచిలీపట్నం (17220)ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు విజయవాడ- విశాఖ- విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు కాకినాడ-విశాఖ- కాకినాడ (17267/17268) మెము స్పెషల్ రైళ్లు రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు

సోమ,మంగళవారాల్లో విశాఖలో బయల్దేరే విశాఖ-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖ(18513)ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 9తేదీల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. సోమ,మంగళవారాల్లో హౌరాలో బయల్దేరే హౌరా - జగదల్‌పూర్ (18005)సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ కొరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ - హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా 7,8 తేదీలలో కోరాపుట్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

నాందేడ్ -విశాఖపట్నం రీషెడ్యూల్

ఆదివారం నాందేడ్‌లో సాయంత్రం 4.30గంటలకు బయల్దేరవలసిన నాందేడ్-విశాఖ(20812) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ పెయిరింగ్‌రైలు రాక ఆలస్యంగా రాత్రి 8.30గంటలకు బయల్దేరింది.

కడలి హోరు.. పరుగు జోరు

- ఉత్సాహంగా వైజాగ్ నేవీ మారథాన్
- కిక్కిరిసిన సాగరతీరం



మారథాన్‌లో చిన్నారులు



మారథాన్‌లో పాల్గొన్న అథ్లెట్లు, నేవీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు

విశాఖ స్పోర్ట్స్: ఒకవైపు కడలి అలల హోరు.. మరోవైపు పరుగువీరుల జోరుతో విశాఖ సాగరతీరంలో పండగ వాతావరణం నెలకొంది. లేలేత సూర్యుని కిరణాలు పలకరిస్తుండగా వేలాది మంది యువత, నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హుషారుగా పరుగు పెట్టారు. వైజాగ్ నేవీ మారథాన్ 8వ ఎడిషన్‌లో భాగంగా ఐదు కిలోమీటర్ల ఫన్ విభాగంలో ఔత్సాహికులు సరదాగా పరుగు పెడితే.. మిగిలిన విభాగాల్లో అథ్లెట్లు విజయమే లక్ష్యంగా శ్రమించారు. ఒంపు సొంపులు తిరిగిన తీరం వెంట సాగిన పరుగు.. అథ్లెట్లకు ఎన్నో మధురానుభూతులను మిగిల్చింది. ఈ మారథాన్‌లో మారిషస్ అథ్లెట్లు, స్థానిక చిన్నారులు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

విశాఖ సాగరతీరంలో ఆదివారం వైజాగ్ నేవీ మారథాన్ 8వ ఎడిషన్ ఉత్సాహంగా జరిగింది. 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలో మీటర్ల రేస్‌తో పాటు ఐదు కిలోమీటర్ల ఫన్ పరుగులో వేలాది మంది పాల్గొన్నారు. ఫుల్ మారథాన్‌ను తూర్పు నావికాదళ కమాండ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, హాఫ్ మారథాన్‌ను వైస్ అడ్మిరల్ శ్రీనివాసన్, 10కె రన్‌ను సీపీ రవిశంకర్ ప్రారంభించారు. ద పార్క్ హోటల్ సర్కిల్ దరి వైఎస్సార్ విగ్రహం వద్ద మారథాన్ రేసులతో పాటు ఫన్ పరుగును అథ్లెట్లు, యువతీయువకులు ప్రారంభించారు. ఆర్.కె.బీచ్ మీదుగా నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద యూటర్న్ తీసుకున్నారు. కాళీమాత ఆలయం మీదుగా ఏడువేల మంది ఔత్సాహికులు పాల్గొన్న ఐదు కిలోమీటర్ల ఫన్ పరుగు ఎంజీఎం పార్క్ వద్ద ముగిసింది. మిగిలిన మూడు కేటగిరీల్లో పరుగు ఐఎన్‌ఎస్ కళింగ వైపు సుందరమైన సాగరతీరం మీదుగా కొనసాగింది. 2,700 మంది పాల్గొన్న 10 కిలోమీటర్ల పరుగు తెన్నేటి పరుగు వద్ద యూ టర్న్ తీసుకోగా హాఫ్ మారథాన్ పరుగువీరులు రుషికొండ గాయత్రి కళాశాల దగ్గర యూ టర్న్ తీసుకున్నారు.

పూర్తి మారథాన్‌లో పాల్గొన్న 500 మంది అథ్లెట్లు ఐఎన్‌ఎస్ కళింగ సమీపంలోని చేపాలుప్పాడ దగ్గర యూటర్న్ తీసుకున్నారు. వీఎంఆర్డీఏ పార్క్‌లో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో సీనియర్ నావికాదళ అధికారులు, కలెక్టర్ ఎ.మల్లికార్జున హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. డీహైడ్రేషన్, వైద్య శిబిరాలు, కన్వీనియన్స్ స్టేషన్లు, రన్నర్స్‌ను ఉత్సాహపరించేందుకు మార్గంలో వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.

విజేతలు వీరే.. : పురుషుల ఓపెన్ విభాగంలో శిఖంధర్ తడాఖే 2.30 గంటల్లో పూర్తి చేసి విజేతగా నిలవగా హాఫ్ మారథాన్‌ను దీపక్ కుంబార్ 1.06 గంటల్లో పూర్తి చేశారు. 10 కిలోమీటర్ల పరుగును సోను కుష్వా 31 నిమిషాల్లో పూర్తి చేసి విజేతగా నిలిచారు. మహిళా విభాగంలో ఆశా 3.08 గంటల్లో పూర్తి చేయగా.. లిలియన్ రుట్టో హాఫ్ మారథాన్‌ను 1.20 గంటల్లో, 10 కిలోమీటర్ల పరుగును మేరీగ్రేస్ 44 నిమిషాల్లో పూర్తి చేసి విజేతలుగా నిలిచారు.



విజేత శిఖందర్‌కు అవార్డు అందజేస్తున్న ఈఎన్‌సీ అధికారి రాజేష్ పెంధార్కర్



10 కిలోమీటర్ల పరుగు విజేతకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున



పాల్గొన్న మారిషెస్ అథ్లెట్ల బృందం

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి



విజేతలకు బహుమతులు అందించి సన్మానిస్తున్న సీఐ సత్యనారాయణ, విశాఖ జిల్లా ఇన్‌కామ్ టాక్స్ డైరెక్టర్ శంకర్ పాండే. సద్గురు సేవాశ్రమం సాయిరాం స్వామిజీ

జి.మాడుగుల: హిందూ ధర్మ పరిరక్షణ భజన సాంప్రదాయ సంరక్షణకు ఇటువంటి భజన పోటీలు ఎంతగానో దోహదపడుతాయని ఇన్‌కామ్ టాక్స్ డైరెక్టర్ శంకర్ పాండే, సీఐ సత్యనారాయణ, విశాఖపట్నం భీమిలి సద్గురు సేవాశ్రమం, గాంధీనగరం శ్రీ హనుమాన్ సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ తెలిపారు. మండలంలో గాంధీనగరంలో గల హనుమాన్ సేవాశ్రమంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి భక్తి గీతాల భజన పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతలకు వారు నగదు బహుమతులు, శాలువలు కప్పి సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా సాయి భక్తి భజన పోటీల్లో జి.మాడుగుల మండలం చేపల్లి గ్రామానికి చెందిన భజనటీమ్‌కు ప్రథమ బహుమతిగా రూ.10,000 నగదు, ద్వితీయ బహుమతి పెదబయలు మండలం గంపరాయి గ్రామానికి చెందిన భజన టీమ్‌కు రూ.5,000, తృతీయ బహుమతి చింతపల్లి మండలం తాజంగి గ్రామానికి చెందిన భజన టీమ్‌కు రూ.3,000నగదు షీల్డులు, ప్రశంసపత్రాలు అందించి టీమ్ లీడర్లను శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. మాట్లాడుతూ భజన సాంప్రదాయ సంరక్షణ భజన సంఘాలను, భజన కళాకారులను ప్రాత్సహించటానికి జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విశాఖ జిల్లా ఇన్‌కామ్ టాక్స్ డైరెక్టర్ శంకర్‌పాండేను సేవాశ్రమం ప్రతినిధి, సభ్యులు శాలువ కప్పి సన్మానించారు. సర్పంచ్ కిముడు రాంబాబు, నిర్వాహకుడు ఎం.మత్స్యరాజు, పైడిరాజు, రామానందాచారి, నీలకంఠం, శ్రీను, శ్రీనివాసరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నిఘా వారోత్సవాలు



మాట్లాడుతున్న ఏయూ ప్రొఫెసర్ కృష్ణమోహన్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో నిఘా వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అవినీతికి అలవాటు పడితే జీవితాలు, కుటుంబాలు ఎలా నష్టపోతాయో ఏయూ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ రైల్వే అధికారులు, సిబ్బందితో భేటీ అయ్యారు. అవినీతికి అలవాటు పడి జీవితాలు ఎలా నాశనం అయ్యాయో నుక్కడ్-నాటక్ వీధి నాటికల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం

బీచ్‌రోడ్డు : ఆయుర్వేదం సర్వరోగ నివారిణి అని కేంద్ర ఆయుష్ శాఖ ఏడీ డాక్టర్ డి.వెంకటేష్ తెలిపారు. ధన్వంతరి జయంతి సందర్భంగా కేంద్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్ వద్ద బీచ్‌రోడ్డులో రైడర్స్ ర్యాలీ నిర్వహించారు. సిరిపురం, జూపార్కు, మద్దిలపాలెం మీదుగా ఏయూ మైదానానికి ర్యాలీ చేరుకొంది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ భారతీయులంతా ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విమ్స్‌లో 50 పడకలతో ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణం త్వరలో చేపడతామన్నారు. ఆయుష్ పూర్వ సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఈశ్వరరావు మాట్లాడుతూ కేజీహెచ్, మధురవాడ, ఆనందపురం, ఉక్కునగరం, గాజువాకలో ఆయుష్ క్లినిక్‌లు ఉన్నాయన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆయుష పరిశోధక అధికారి ఏజేవీ సాయి ప్రసాద్, వరల్డ్ రైడర్ ధవళ భరద్వాజ్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న కేంద్ర ఆయుష్ శాఖ ఏడీ డాక్టర్ వెంకటేష్

ముగిసిన ఎస్‌జీఎఫ్ తైక్వాండో ఎంపికలు



పోటీలను ప్రారంభిస్తున్న పీడీలు అప్పలరాజు, రాములు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సారధ్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తైక్వాండో పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14 బాల, బాలికలు విభాగంలో 17మంది బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు విశాఖ పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.అప్పలరాజు చెప్పారు.

9 నుంచి అన్నమయ్య జిల్లాలో రాష్ట్ర పోటీలు

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్-14, 17,19 విభాగాల్లో బాలురకు అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 9 నుంచి 11వరకు నిర్వహించనున్నారు. బాలికలు పోటీలు వెన్యూ, తేదీలు ఇంకా వెలువడాల్సి ఉంది.

విజేతలు వీరే: బాల, బాలికలకు వేర్వేరుగా 11 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అయితే బాలికలకు 9 కేటగిరీలు, బాలురు 8 కేటగిరీల్లో మాత్రమే పోటీలకు హాజరయ్యారు. వీరంతా బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను నిర్వాహకులను అప్పలరాజు, పెంటకోట రాము, ఆనంద్ తదితరులు అభినందించారు.

బాలికలు: 16-18 కేజీలు విభాగంలో అచ్యుతాపురం కేజీబీవీ నుంచి జీ.వైష్ణవి, 20-22 కిలోల విభాగంలో మునగపాక కేజీబీవీ నుంచి సీహెచ్ కీర్తన, 22-24 కిలోల విభాగంలో మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎం. స్రవంతి, 24-26 కిలోల విభాగంలో బి. ధరణిప్రియ, 26-29 కిలోల విభాగంలో మధురవాడ భాష్యం స్కూలకు చెందిన వై. ధనలక్ష్మి, 29-32 కిలోల విభాగంలో బోయిపాలెం శ్రీ ప్రకాశ్ స్కూలుకు చెందిన పి. జ్యోత్స్నశ్రీ, 32-35 కిలోల విభాగంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూలుకు చెందిన కె. ధనలక్ష్మి, 35-38 కిలోల విభాగంలో మధురవాడ భాష్యం హైస్కూలుకు చెందిన ఫాతిమ ఉన్నీష, 38కిలో విభాగంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూలుకి చెందిన భాషిత విజేతలుగా నిలిచారు.

బాలురు విభాగంలో.. : 21-23 కిలోలు విభాగంలో మల్కాపురం సెయింట్ జోసెఫ్ స్కూలు నుంచి జె.తమన్, 25-27 కిలోల విభాగంలో గోపాలపట్నం నారాయణ టెక్నో స్కూలుకు చెందిన సుధీర్, 27-29 కిలోల విభాగంలో ఆరిలోవ ప్రియదర్శిని విద్యానికేతన్‌కు చెందిన వి. ధనుషా, 29-32 కిలోల విభాగంలో జ్ఞానాపురం మరియదాస్ స్కూల్‌నుంచి బి. రోహిత్‌కుమార్, 32-35 విభాగంలో బాలాజీ స్కూలుకు చెందిన ఎ.వెంకట ధనుష, 35-38 కిలోల విభాగంలో శ్రీ విష్ణు స్కూలుకు చెందిన చిద్విలాస, 38-41 కిలోల విభాగంలో గోపాలపట్నం జెడ్పీ హైస్కూలుకు చెందిన కె. వెంకటదుర్గ, 41కిలోలు విభాగంలో నారాయణ ఇంగ్లిషు మీడియం స్కూలుకు చెందిన సుధీర్‌వర్మలు బంగారు పతకాలు సాధించారు.